
www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 2 ఫిబ్రవరి 2023





'సంకల్ప దీక్ష'కు మద్దతు

పిడిఎఫ్ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి



నెల్లూరు :సిపిఎస్ రద్దు కోరుతూ విజయవాడలో జరిగే సంకల్ప దీక్షకు సంపూర్ణ మద్దతు తెలుపు తున్నట్లు పిడిఎఫ్ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మనుబోలు మండలంలోని పలు గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించారు. పట్టభద్రులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపుగా 3లక్షల మంది ఉద్యోగులు ఉపాధ్యా యులు పెన్షన్ లేని సి పి యస్ విధానంతో ఇబ్బందుల పడుతున్నారన్నారు. దేశంలో అనేక రాష్ట్రాలు పాత పెన్షన్ విధానం అమల్లోకి తెచ్చాయన్నారు. ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్ రద్దు చేయడం సాధ్యం కాదని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఈనెల 3న సిపిఎస్ రద్దు కోసం యుటిఎఫ్ ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే "సంకల్ప దీక్ష"ను జయప్రదం చేయాలన్నారు. జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు అనిల్,మండల బాధ్యులు శ్రీనివాసులు, మోహనరావు,రామయ్య, శివసంకరయ్య, శ్రీను, సుధాకరయ్య ఉన్నారు.

పేదల ఊసేలేని బడ్జెట్..!

2023-24 కేంద్రబడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. నిరుపేదల, మధ్య తరగతి జీవులు, జీవన విధానం మార్చుకు పెద్దగా చర్యలు తీసుకున్నట్లు కనిపించలేదు. ధరలు పెరుగుదలతోతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుదలతోనే సర్వం ప్రియంగా మారిపోయాయి. వాటిని తగ్గించ చడానికి ఉన్న అవకాశాలు ఎక్కడా ప్రస్తావించలేదు. జిల్లాలో దశాబ్దాలుగా అతిగతి లేకుండా మూలపడిన రైల్వే ప్రాజెక్టులకు నిధులు కనిపించలేదు. కొత్త ప్రాజెక్టులు రాకపోగా, ఉన్న ప్రాజెక్టులకు నిధులు కనిపించలేదు. సాధారణ విషయాలపైనే దృష్టిపెట్టారని తెలుస్తోంది.

రైల్వే ప్రాజెక్టులకు నిధులు ఏవీ - ధరలు పట్టించుకోలేదా ..



ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

2023-24 కేంద్ర బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. గతేడాది రూ.1.40 లక్షల కోట్ల బడ్జెట్ ఉండగా, ఈ ఏడాది రూ.2.40 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టారు. ప్రజలు నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలతోపాటు, అనేక విషయాల్లో కేంద్ర ప్రభుత్వ విధానాలు కారణంగా సాధారణ, మధ్య తరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ బడ్జెట్‌పైనా సాధారణ జనం బాధలు పట్టించుకుంటారని అందరూ భావించారు. అది పెద్దగా కనిపించలేదు. వ్యక్తిగత ఆదాయపు పన్ను విషయంలో కొంత ఊరట కనిపించింది. ఇప్పటి వరకు రూ.5 లక్షల వరకు ఉన్న ఆదాయపు పన్ను రాయితీని రూ.7లక్షలకు పెంచారు. ఇది మధ్యతరగతి జీవుల్లో కొంత ఊరట కల్పిస్తోంది. రైల్వే బడ్జెట్ విషయంలోనూ ప్రజల్లో ఆసక్తి ఉన్నా పెద్దగా కేటాయింపులు జరగలేదని తెలుస్తోంది కేవలం సాధారణ విషయాలపైనే దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. రాజధాని, శతాబ్ధి, హంసఫర్, తేజస్ సూపర్ ఫాస్ట్ రైళ్లలో ఆధునిక వసతులు కల్పించనున్నారు. ఇందులో మూడు రైళ్లు విజయవాడ నుంచి నెల్లూరు మీదుగా ప్రయాణం చేయనున్నాయి. ఇక్కడ వెయ్యి కోచ్‌లలో వసతులు ఏర్పాట్లు చేయనున్నారు. నూతనంగా దేశవ్యాపితంగా ప్రవేశపెడుతోన్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల మార్గాన్ని ఆధునీకరించనున్నారు. ఇందుకోసం బడ్జెట్‌లో రూ.17,216 కోట్లు కేటాయించారు. జిల్లాకు హైదరాబాద్ - చెన్నయ్, విజయవాడ -తిరుపతి ప్రాంతాలో వందేభారత్ రైళ్లు రానున్నాయి. ప్రస్తుతం ఉన్న రైల్వే ట్రాక్‌లో కేవలం 130 కిలో మీటర్ల వేగంతోనే వందే భారత్‌నడుస్తోంది. రైల్వే లైన్ ఆధునీకరిస్తే 180 కిలో మీటర్ల వేగంతో ప్రయాణం చేయొచ్చు. కృష్ణపట్నం పోర్టు ద్వారా బొగ్గు, ఎరువులు, ఆహార ధాన్యాలు ఎగుమతి, దిగుమతి జరుగుతున్నాయి. దేశంలో 100 ప్రాజెక్టులకు నిధులు కేటాయించారు. . నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ ఆధునీకరణ కోసం 2015లో కేంద్ర రైల్వే మంత్రి పియూష్‌గోయల్ రూ.103 కోట్లతో శంకుస్థాపన చేశారు. దేశంలోని రైల్వే స్టేషన్లు ఆధునీకరణ కోసం తొలి రైల్వే స్టేషన్‌గా నెల్లూరును ఎంపిక చేసుకున్నారు .అప్పటి ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ప్రోత్సాహంతో ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. నెల్లూరు తూర్పు, పడమర స్టేషన్ ఆధునీకీకరించడం, హోటళ్లు, షాపింగ్ కాంప్లెక్స్, సినిమా హాళ్లు ఇలా అనేక సంస్థలతో నూతన హంగులతో దీనిని నిర్మించాలని ఉంది. రూ.103 కోట్లతో దీనిని నిర్మించడానికి ఏడేళ్ల క్రితం శంకుస్థాపన చేసినా ఇప్పటి వరకు ఒక్క పని ప్రారంభించలేదు. ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిం పులు జరగలేదు.. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే పనులు సాగుతున్నాయి. ఇప్పటికే జిల్లాలోని పలు మండలాల్లో భూసేకరణ పూర్తిచేశారు. ఈ ప్రాజెక్టు దాదాపు మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి. ఇది పూర్తయితే మెట్ట ప్రాంతాల్లోని రైతులు, ప్రజలు, వ్యాపారులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ప్రతి బడ్జెట్‌లోనూ కొద్దిగా నిధులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఈ బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిధులు ఇస్తారని చూశారు. ఎక్కడా కనిపించలేదు. బిట్రగుంట లోకోషెడ్ విషయంలోనూ 30 సంవత్సరాలు మాటలకే పరిమితం అవుతున్నారు. మమతా బెనర్జీ రైల్వే మంత్రిగా ఉన్న సమయంలోనూ, ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు ఒక్క రూపాయి నిధులు ఇవ్వలేదు. కేవలం ప్రతిపాదనల వరకే పరిమితమైంది. లోకోషెడ్ వస్తే జిల్లా ఎంతో అభివృద్ధి సాధిస్తుంది. గూడూరు -దుగరాజుపట్నం పోర్టు వరకు కొత్త రైల్వే లైన్ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం భూ సేకరణ కోసం రూ.50 కోట్లు ఇచ్చింది.అటు తరువాత దుగరాజుపట్నం పోర్టును కేంద్రం పక్కనపెట్టింది. పోర్టు రాకపోయినా ఆ ప్రాంతంలోని ప్రజలకు కనీసం ప్రయాణ రహదారైనా వస్తుందని భావి స్తున్నారు. కేవలం 35 కిలో మీటర్లు నూతన రైల్వే మార్గం వస్తే గూడూరు డివిజన్ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది పైన చెప్పిన ఒక్క ప్రాజెక్టుకు నిధులు కేటాయించినట్లు కనిపించడం లేదు. మిగిలిన విషయాలు షరా మామూలుగానే ఉన్నాయి. ప్రధానంగా పెట్రోల్, డీజిల్ ధరలు విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. ఇవి తగ్గితే ఇతర ధరలు తగ్గుతాయి, వీటిని తగ్గించడానికి ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. సాధారణ, మధ్య తరగతి ప్రజలకు ఎలాంటి ప్రయోజనమూ జరగలేదని విమర్శలున్నాయి. .



పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెడుతున్న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్

వైసిపిలో 'కోటంరెడ్డి' ప్రకంపనలు..!

- ○'మేకపాటి' అసంతృప్తి సెగలు
- ○ఇన్‌ఛార్జ్ నియామకంపై రచ్చ
- ○'ఆనం'పై తమ్ముడు ఆగ్రహం
- ○ఉత్కంఠ రేపుతోన్న జిల్లా రాజకీయం

వైసిపిలో పెను తుపాన్ తీవ్రంగా మారుతుంది. వెంకటగిరి, నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎలు ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడి శ్రీధర్‌రెడ్డి వైసిపి వీడడం దాదాపు ఖరారైంది. వీరిద్దరితో వైసిపి అధిష్టానం తలపట్టుకుంటుండగా ఇప్పుడు ఉదయగిరి ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి మరో వివాదానికి తెరలేపారు. ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కొడవలూరు దనంజయరెడ్డి తన శత్రువులతో కలిసి ఇబ్బందులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. " నేను వైసిపిలో అవమానాలు పడ్డాను. అనుమానాలు ఎదుర్కొంటున్నాను. ఇక వైసిపిలో ఉండలేదనని " అని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రకటించారు. బుధవారం మీడియాతో మాట్లాడారు. టిడిపి అవకాశం ఇస్తే నెల్లూరు రూరల్ నుంచి పోటీచేయాలని ఆశగా ఉందని తెలిపారు. జిల్లాలో జరుగుతోన్న వివాదానికి సంబంధించి, వైసిపి అధిష్టానం ఆందోళన చెందుతోంది. నెల్లూరు రూరల్ పార్టీ ఇన్‌ఛార్జ్‌ను నియమించడానికి కసరత్తు చేస్తున్నారు.



కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎంఎల్‌ఎ -నెల్లూరు రూరల్



ఆనం రామనారాయణరెడ్డి ఎంఎల్‌ఎ - వెంకటగిరి



మేకపాటి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఎల్‌ఎ -ఉదయగిరి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

వైసిపిలో ఉత్కంఠ పెరుగుతోంది. నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి రాజకీయంగా కీలక నిర్ణయం తీసుకున్నారు. వైసిపిలో ఇక కొనసాగలేనని బుధవారం ఆయన విలేకర్లకు స్పష్టం చేశారు. అవకాశం ఇస్తే టిడిపి నుంచి పోటీ చేస్తానని తన మనస్సులో మాట ప్రకటించారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వివాదం వైసిపి అధిష్టానాన్ని కుదిపేస్తోంది. తాను ఒక్కడినే కాదని రాష్ట్రంలో సుమారు 45 మంది ఎంపి, మంత్రులు, ఎంఎల్‌ఎల ఫోన్లు ట్యాపింగ్ జరుగుతుందని బాంబుపేల్చారు. రాష్ట్ర వ్యాపితంగా చర్చసాగుతోంది. నెల్లూరు రూరల్‌లో నష్టనివారణ చర్యలకు వైసిపి అధిష్టానం చర్యలు తీసుకుంటుంది. ఎవరిని ఇక్కడ ఇన్‌ఛార్జ్‌గా పెట్టాలనే విషయంపై బాలినేని శ్రీనివాసులురెడ్డి, సజ్జలరామకృష్ణారెడ్డి, ఇతర నేతలు ముఖ్యమంత్రి జగన్‌తో బుధవారం సాయంత్రం భేటి అయినట్లు తెలుస్తోంది. ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్‌యాదవ్, ఆనం విజయకుమార్‌రెడ్డి పేర్లు విని పిస్తున్నాయి. ఇక నెల్లూరు రూరల్‌లో నువ్వా నేనా అన్నట్లు రాజకీయం సాగనుంది. అది . కారులు ఆందోళన చెందుతున్నారు. ఏం జరుగుతుందోనన్న భయం వెంటాడుతోంది. వెంకటగిరి ఎంఎల్‌ఎ ఆనం రామ నారాయణరెడ్డి దాదాపు టిడిపి గూటికి వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఈ క్రమంలో కోటంరెడ్డి, ఆనంపై వైసిపి మూకుమ్మడి దాడికి దిగుతోంది. ఆనం రామనారాయణరెడ్డి సోదరులు ఆనం విజయ కుమార్‌రెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేసి, అటు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని ఇటు, ఆనం రామనారాయణరెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. ఎవరూ వెళ్లినా వైసిపి జిల్లాలో విజయం సాధిస్తుందని తెలి పారు. తాజాగా ఉదయగిరి ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి బయటకొచ్చారు. ఇటీవల నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌ల నియామకం చేశారు. కొడవలూరు దనంజయరెడ్డిని ఇక్కడ నియమించారు. ఆయన ఎంఎల్‌ఎతో మాట్లాడకుండా మాజీ ఎంపిపి, వైసిపి నేతల, చేజర్ల సుబ్బారెడ్డితో సఖ్యతగా ఉంటూ, తనను ఇబ్బందులకు గురిచేస్తు న్నారని చెప్పారు. కావాలనే తనను దెబ్బతీయడానికి ఇన్‌ఛార్జ్ వ్యవహ రిస్తున్నారని, ఈ విషయాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. జిల్లాలో ముగ్గురు ఎంఎల్‌లు సొంతపార్టీపై తిరుగుబాటు ఎగుర వేయ డంతో పార్టీలో గందరగోళంగా ఉంది. ఏం జరుగుతుందో చూడాలి.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-నెల్లూరు :నగర పాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న అన్ని విభాగాల కార్యదర్శులు విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కమిషనర్ హరిత ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక 46/2 కాపువీధి సచివాలయాన్ని కమిషనర్ బుధవారం తనిఖీ చేశారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

దళితులపై దాడులను ఖండించాలి

కెవిపిఎస్, వ్య.కాస. సిపిఎం - 8న దగదర్తిలోసదస్సు

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలో దళితులపై దాడులు జరగ డాన్ని నిరసిస్తూ సిపిఎం, కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం తీవ్రంగా ఖండిస్తున్నాయని, బాధితులకు అండగా నిలబడేందుకోసం ఈనెల 8వ తేదీన దగదర్తి లోని కామ్రేడ్ జక్కా వెంకయ్య విజ్ఞానకేంద్రంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ నాయకులు ప్రకటించారు. దగదర్తి మండలం లో దళితులపై వరుసగా జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ నగరంలోని బాలాజీ నగర్ సిపిఎం ఆఫీసులో కెవిపిఎస్ , వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆలూరు తిరుపాలు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జొన్నలగడ్డ వెంకమ రాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పాల్గొన్నారు. నాయకులు మాట్లాడుతూ దగదర్తి మండలంలో దళితులపై వరుసగా దాడులు జరుగుతున్నాయన్నారు. దళితులకు అండగా నిలవాల్సిన పోలీసులు అధికార పార్టీ నేతలకు కొమ్ము కాస్తూ, దళితులపైనే కౌంటర్ కేసులో పెట్టడం శోచనీయమన్నారు. ఇటీవల ఉప్పలపాడు లో దళిత కౌలు రైతు తలారి రవి 2 ఎకరాలను కౌలుకు తీసుకుని సాగు చేస్తుంటే ఆ వరి నాటును అదే గ్రామ కాపురస్తుడు పల్లాల వెంకయ్య అధికార పార్టీ నాయకుల అండతో తన ట్రాక్టర్ తో దున్నించి పంటను నాశనం చేశారన్నారు. ఈ దారుణంపై పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేయగా ఎస్ఐ తలారి రవి పైనే కౌంటర్ కేసు పెట్టి తీవ్రంగా కొట్టి వేధింపులకు గురి చేశారన్నారు. ఉలవపాళ్ల హైవే పెట్రోల్ బంకులో పనిచేస్తున్న గోచిపాతల తేజ పై బాడుగులపాడు ఎంపిటిసి వెలినేని మహేష్ నాయుడు దాడి చేశారన్నారు. ఆ కేసు నీరుగార్చారన్నారు. చెన్నూరులో దళిత యువకుడు సోము మల్లికార్జునపై ఎస్ఐ దాడి చేశారన్నారు. ఇలా దళితులపై జిల్లాలో దళితులపై జరుగుతున్న వరుస దాడులను ఖండించాలన్నారు. 8న జరిగే సదస్సులో మండలంలోని ప్రజలు,దళిత సంఘాలు పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు ఎం మోహన్ రావు , సిపిఎం కోవూరు మండల కార్యదర్శి గండవరపు శేషయ్య పాల్గొన్నారు.

శ్రీధర్‌రెడ్డి, ఆనం తీరుపై

విజయ్‌కుమార్‌రెడ్డి తీవ్ర విమర్శలు



మాట్లాడుతున్న ఆనం విజయ్‌కుమార్

ప్రజాశక్తి-నెల్లూరు :వైసిపిపై తిరుగుబావుటా ప్రకటించిన నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వెంకటగిరి ఎంఎల్‌ఎ, తన సోదరుడు అయిన ఆనం రామ నారాయణరెడ్డి తీరు ఏరదాటాక తెప్ప తగలేసి నట్లు ఉందని వైసిపి నేత ఆన విజయ్ కుమార్‌రెడ్డి విమర్శిం చారు. మంగళ వారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ చైర్పర్సన్ ఆనం అరుణమ్మతో ఆనం విజయకుమార్ రెడ్డి మాట్లాడారు. విజయకుమార్ మాట్లాడుతూ పార్టీ వదిలి వెళ్ళిపోవాలనుకుంటే నిరభ్యంతరంగా వెళ్లిపోవచ్చన్నారు. రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతూ పెద్దన్న.. పెద్దన్న అంటూ తమ చుట్టూ తిరిగిన విషయాన్ని మర్చిపోయారని ఎద్దేవా చేశారు. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి,కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి రౌడీ షీటర్లకు, బ్లేడు బ్యాచులకు నెల జీతాలు ఇస్తూ పార్టీ కార్యాలయం లో పోషిస్తూ ఎన్నో ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇక తన సోదరుడు ఆనం రామనారాయణరెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన చూడని పదవులా.. సిఎం పదవి దగ్గర దాకా వెళ్లి వచ్చిన వ్యక్తి అన్నారు. టిడిపిలోకి వెళ్లి అవమానపడి ఇంట్లో ఉంటే వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పిలిచి పార్టీ టికెట్ ఇచ్చారని గుర్తు చేశారు. తీరా గెలిచిన తర్వాత ఇలా మాట్లాడటం సరికాదన్నారు. .అనిల్ ని పొగడ్తలతో ముంచెత్తిన విజయ్ కుమార్ రెడ్డి వయసులో చిన్నవాడైన అనిల్ కుమార్ ఎంతో నిజాయితీపరుడన్నారు.

త్వరలో ఇళ్లు పంపిణీ

ప్రజాశక్తి -కందుకూరు : జి+3 ఇళ్లలో జరుగుతున్న మౌలిక వసతుల పనులను బుధ వారం కమిషనర్ ఎస్ మనోహర్ పరిశీలించారు. సుమారు 90శాతం రోడ్లు, డ్రెయిన్లు పూర్తయ్యాయి.ఎస్‌టిపి ప్లాంట్ ఒకటి 70శాతం పూర్తి అయింది. ఇది పూర్తి అవగానే రెండు నెలల్లో ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని కమిషనర్ తెలిపారు. మొత్తం 1,408 ఇళ్లకు గానూ సుమారు 1200 మంది పేరు మీద రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. మిగతా వాళ్లు కూడా మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు

ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోవాలి

ప్రజాశక్తి -కందుకూరు :గుడ్లూరు మండలం చేవూరు చెరువుపొరంబోకు సర్వేనంబరు 879లోని భూమిని దొంగస్వామి రామదూత ఆక్రమణ చెర నుంచి స్వాధీనం చేసుకోవాలని ఎపి హేతువాదసంఘం అధ్యక్షులు నార్నెవెంకటసుబ్బయ్య స్థానిక సబ్ కలెక్టర్ కార్యలయంలో బుధవారం వినతి పత్రం అందజేశారు. ఆసంఘం నాయకులు వై .బాబురావు, జిల్లా హేతువాద సంఘ సభ్యుడు అహమ్మద్ ఉన్నారు.

పేదల అభ్యున్నతికి కృషి : బిఎస్‌పి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : రాష్ట్రంలో బహుజన రాజ్యం వస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని బిఎస్‌పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జానకి ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం బహుజన సమాజ్ పార్టీ సర్వేపల్లి నియోజకవర్గం సమావేశం మండలంలోని విలుకాన పల్లి గ్రామంలో జరిగింది. ఆ పార్టీ మండల అధ్యక్షులు పల్లం రాజా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి జానకి ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బిఎస్‌పి సీనియర్ నాయకులు మర్రి రామచంద్రయ్య, సర్వేపల్లి నియోజకవర్గం ఉపా ధ్యక్షులు పొన్నూరు ఏడుకొండలు, దార్ల రమేష్, గోపాల్ ఉన్నారు.

అత్యాచారంపై ఫిర్యాదు

ప్రజాశక్తి -గుడ్లూరు :మండలంలో గుండ్ల పాలానికి చెందిన ఓ మైనర్ బాలికపై రాజుపాలెంకు చెందిన ఏసుబాబు అనే వ్యక్తి అత్యాచారం చేసి పారిపోయినట్లు బాధితురాలి తల్లి గుడ్లూరు పోలీస్ స్టేషన్లో బుధవారం ఫిర్యాదు చేసింది. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు గుడ్లూరు సిఐ సుబ్బారావు తెలిపారు. బాలికని ఉలవపాడు వైద్యశాలకు తరలించి పరీక్షల నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నేను వైసిపిలో పనిచేయలేను..!

- ◆నా ఫోన్ ట్యాపింగ్ ఆధారాలివి
- ◆రాష్ట్రంలో45 మంది ఎంపిలు, ఎంఎల్‌లకు ఇదే సమస్య
- ◆కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేస్తా
- ◆జగన్ ఆదేశాలతోనే ఇలా జరిగింది
- ◆నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పక్కన సోదరుడు గిరిధర్‌రెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

"నాపై నమ్మకం లేకుండా, అవమానకరంగా వ్యవహరించిన వైసిపిలో ఇక పనిచేయలేను" అని, నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. బుధవారం నెల్లూరురూరల్ కోటంరెడ్డి కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబంతో మూడు దశాబ్దాల స్నేహం ఉందన్నారు. జగన్ పార్టీ ఏర్పాటు చేయక ముందే తాను జగన్‌కు అండగా ఉన్నానన్నారు. జీవితంలో ఇలాంటి సమావేశం పెట్టాల్సి వస్తుందని అనుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్ల ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చిత్త శుద్ధితో పార్టీ కోసం పనిచేశానన్నారు. అధికారం వచ్చిన తరువాత గుర్తింపు కోరుకున్నానని, పార్టీ గుర్తింపు ఇవ్వకపోయినా ప్రజల కోసం పని చేశానన్నారు. జగన్ గురించి వై.సి.పి.పై ఏనాడూ పరుషంగా మాట్లాడలేదన్నారు. ఇటీవల మీడియా సమావేశం ఏర్పాటు చేయగా, అక్కడకు వచ్చిన మీడియా, పోలీసుతో తన ఆవేదన వ్యక్తం చేశాన న్నారు. తన ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నానని చెప్పానని, అధికారిక ప్రెస్‌మీట్ కాదన్నారు. ఏం జరిగిందో పార్టీ పెద్ద సంజాయిషీ అడిగుంటే ఇచ్చేవాడినని, అలా కాకుండా నెల్లూరు రూరల్ ఇన్‌ఛార్జ్‌ని ప్రకటి స్తామని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. బారా షాహిద్ దర్గాకు జగన్ నిధులు మంజూరు చేసినా ఆర్థిక శాఖ విడుదల చేయ లేదని, ఆర్థిక శాఖ కార్యదర్శి ఎస్ఎస్ రావత్ తీరును విమర్శించానే తప్ప పార్టీపై కాదన్నారు. పార్టీకి వీర విధేయుడైన తనను కొద్ది రోజులుగా ఇబ్బంది పెట్టారని పేర్కొన్నారు. జగన్..సజ్జల..విజయ్ సాయి రెడ్డి ఫోన్లను కేంద్రం ట్యాప్ చేసినట్లు ఆధారాలు వస్తే మీ స్పందన ఎలా ఉంటుందా అని ప్రశ్నించారు. తాను ఐ ఫోన్ వాడుతున్నానని, నా మిత్రుడు కాంట్రాక్టర్ లంకా రామ శివా రెడ్డి ఫోన్ చేస్తే మాట్లాడానని, నా ఫ్రెండ్ కూడా ఐ ఫోన్ వాడుతున్నారని, ఇద్దరూ రికార్డ్ చేయలేమ న్నారు. రాష్ట్ర ఇంటెలిజెన్స్ ఐ.జి. సీతారామాం జనేయులు ఫోన్ చేసి, జగన్‌కు నీపై ప్రేమ ఉందని, ఎందుకు అలా మాట్లాడుతున్నావని, నన్ను బెదిరించే పనిచేశారన్నారు. ఓ పోలీసు అధికారి తన ఫోన్ ట్యాపింగ్ జరుగుతున్న విషయం చెప్పారన్నారు. ఆధారాలు ఉన్నాయి కాబట్టే ట్యాపింగ్ జరిగిందని చెప్పాను తప్ప బాలినేని శ్రీనివాసులురెడ్డి చెప్పినట్లు చేయలేదన్నారు. టిడిపిలోకి వెళ్లడానికే శ్రీధర్‌రెడ్డి ఇలా చేస్తున్నారని చెబుతున్నారని, తన ఫోన్ ట్యాపింగ్ జరిగిన తీరును ఆయన మీడియాకు చూపించారు. ఇదేదో నా ఒక్కరి సమస్య కాదని, రాష్ట్రంలోని మంత్రులు..హై కోర్టు జడ్జిలు... న్యాయ వాదులు.. ఐఎఎస్, ఐపి ఎస్‌లు.. మీడియా ప్రతి నిధులు.. ఎంపిల ఫోన్లు కూడా ట్యాప్ చేస్తారన్నారు. ఇది కేవలం ఐఎఎస్ అధికారి పనికా దని, ముఖ్యమంత్రి ఆదేశాలతోనే ఇలా చేశారని ఆరోపించారు. ఈ నెంబర్ 9849966000 నుంచి ఫోన్ చేశారని, ఇది సీతా రామంజనేయులు ఫోన్ అన్నారు. రెండు రోజులుగా 35 మంది ఎంఎల్‌ఎలు, నలుగురు ఎంపిలు, ఇద్దరు మంత్రులు, తనకు ఫోన్‌చేసి బాధపడ్డారన్నారు. మా ఫోన్లు కూడా ట్యాపింగ్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారన్నారు. "నన్ను నమ్మకుండా నాపై" నమ్మకం లేకుండా ఉందని, అందుకే ఇక వైసిపిలో తాను ఉండలేనన్నారు. రాజకీయ ప్రత్యర్థులను వైసిపి ఇబ్బందులు పెడుతుందన్నారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ఎదుర్కొవడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. రాష్ట్రంలో బెస్ట్ ఎంఎల్‌ఎ అన్నారని, పార్టీ అభివృద్ధి కోసం ఎంతో చేశానని, తన లాంటి వ్యక్తిని ఎందుకు బయటకు పంపుతున్నారో ముఖ్యమంత్రి, సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పాలన్నారు. రాజకీయ భవిష్యత్తు గురించి పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులతో మాట్లాడి నిర్ణయం తీసుకుంటానన్నారు. తనకు టిడిపి నుంచి పోటీ చేయాలని ఉందని, వారితో చెప్పానని, చంద్రబాబు నాయుడు టికెట్ ఇస్తే నెల్లూరు రూరల్ నుంచి పోటీ చేస్తానన్నారు.తనపై జరిగిన ఫోన్ ట్యాపింగ్ విష యంలో కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేస్తున్నానన్నారు. ఎవరు ఏం చెప్పినా తన నిర్ణయం మారదన్నారు. సమావేశంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఉన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



నెల్లూరు :ఈ నెల 15న ఎస్‌ఎఫ్‌ఐ, యుటిఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ప్రజ్ఞావికాసం పేరుతో నిర్వహించబోవు పరీక్షలకు సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరణ చేశారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ నాయకులు మాట్లాడారు. విద్యావేత్త కె. ఎస్.లక్ష్మణరావు పర్యవేక్షణ 15న జరిగే 10 వ తరగతి ప్రజ్ఞా వికాసం కార్యక్రమానికి అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీ హర్ష ,నెల్లూరు నగర అధ్యక్ష, కార్యదర్శి నరేంద్ర ,అనిల్ నెల్లూరు రూరల్ ఉపాధ్యక్షుడు సిసింద్రీ, ప్రశాంత్ ,సుమన్ ఉన్నారు.

దళితులపై దాడులు దారుణం : టిడిపి

నెల్లూరు : ఎస్‌పి మనోభావాలు దెబ్బతిన్నాయని ప్రకటించే ముందు అదే ఎస్‌పి వ్యవహారశైలి వల్ల దెబ్బతిన్న దళితుల మనోభావాలకు సమాధానం చెప్పాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి జెన్నీ రమణయ్య డిమాండ్ చేశారు. నగరంలోని టిడిపి కార్యాలయంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జెన్నీ రమణయ్య, నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి సాబీర్ ఖాన్, రాష్ట్ర ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి మాతంగి కష్ణ, నెల్లూరు పార్లమెంట్ టిడిపి మైనార్టీ ఉపాధ్యక్షుడు అల్లాబక్షు మీడియా సమావేశం నిర్వహించారు. జెన్నీ రమణయ్య మాట్లాడుతూ టిడిపి నేతలపై జరిగిన దాడుల పై ఎస్‌పి స్పందించకపోవడంతో నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ తన ఆవేదనను వ్యక్తపరచారన్నారు. ఎస్‌పి మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడలేదన్నారు. దళితులపై జరుగుతున్న దాడులను నివారిం చడంలో పోలీస్ శాఖ విఫలమైందన్నారు. సాబీర్ ఖాన్ మాతంగి కష్ణ అల్లా బక్షులు మాట్లాడారు. కనపర్తి గంగాధర్, గోడ పద్మ, ఇజ్రాయిల్, పెంచలయ్య, మిర్చి రవి, వెంకట శేషు, వెంకట లక్ష్మీ, అరవ కిషోర్, మారుతి, నాగరాజు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి -వెంకటాచలం : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చవటపాలెం గ్రామ సచివాలయ పరిధిలో రెండో రోజు ఎర్రగుంట గ్రామంలోని సరస్వతి నగర్‌లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వంలో భాగంగా పర్యటించిన ఆయన మాట్లాడుతూ సుమారు మూడేళ్ల పరిపాలన పూర్తయిన తర్వాత ప్రజల ముంగిటకు వెళ్తున్న తమకు, ప్రజలు ఎదురేగి నీరాజనాలు పలుకుతున్నారన్నారు. ఇదే తమ ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు.ఎంపిడిఒ సుస్మిత, మందల వెంకట శేషయ్య, మాజీ జెడ్పిటిసి రాచాల రవికుమార్ యాదవ్ ఎంపీపీ మంద కవిత కష్ణ, కో ఆప్షన్ సభ్యులు హుస్సేన్ ఉన్నారు.

108 రకాల వంటకాలు

పొదలకూరు :మండలంలోని ఊసపల్లికి చెందిన ఊసా శివ కుమార్, శ్రీదేవమ్మల ముద్దుల కుమార్తె శివానికి నెల్లూరు బివి నగర్‌కు చెందిన ఉమ్మడిశెట్టి శివకుమార్‌తో ఇటీవల వివాహమైంది. అల్లుడు మొదటిసారి ఇంటికి రావడంతో ప్రత్యేకంగా విందు ఏర్పాటు చేయాలని భావించిన వారు మొత్తం 108 రకాల వంటకాలు తయారు చేయించారు. దీనిపై మండంలో చర్చ జరిగింది.

షాదీ మంజిల్ పరిశీలన

ప్రజాశక్తి-నెల్లూరు :నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన షాదీ మంజిల్‌లో అన్ని వసతులను కల్పించి శుభకార్యాల నిర్వహణలకు సంసిద్ధం చేశామని కమిషనర్ హరిత వెల్లడించారు. స్థానిక 43 వ డివిజన్ కోటమిట్టలో అధునాతన స్థాయిలో నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న షాదీమంజిల్‌ను కమిషనర్ బుధవారం అధికారులతో కలిసి పరిశీలించారు. నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ సంపత్ కుమార్, డిఈ చంద్రయ్య ఉన్నారు.

సచివాలయం వెలవెల..


సమయపాలన పాటించని సిబ్బంది

ప్రజాశక్తి -కందుకూరు :సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించకుండా విధులకు డుమ్మా కొడు తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని 11, 13 సచివాలయాల సిబ్బంది బుధవారం 10.30 గంటల తర్వాత కూడా విధులకు రాకపోవడంతో ఖాళీ కుర్చీలతో ఉన్న కార్యాలయాన్ని వెంకట్రాద్రి పాలెంకు చెందిన వైసిపి నాయకుడు జిల్లాలమూడి వెంకటేశ్వర్లు ఫోటోలు తీసి సోషల్ మీడియాలో పెట్టడం చర్చనీయాంశంగా మారింది.

షాపుల వేలం ద్వారా

రూ. 80 లక్షల ఆదాయం

ప్రజాశక్తి-వలేటివారిపాలెం :మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో కొండపై వివిధ షాపుల నిర్వహణకు సంబంధించి బుధవారం వేలం పాట నిర్వహించారు. వాహన పార్కింగ్ రుసుంను బచ్చు తిరుపాలు రూ. 23.52 లక్షలు, చీరలు, జాకెట్లు మద్దులూరి మాల్యాద్రి రూ. 24,05,000, కూల్‌డ్రింక్స్ చీమలదిన్నె వెంగయ్య రూ. 10 లక్షలు, ఫలహారశాల కుర్రా మనోహర్ రూ. 8,05,000, పాదరక్షలు బచ్చు వెంగళరావు రూ. 7,07,000, పాలు, నెయ్యి బచ్చు వెంగళరావు రూ. 69వేలు, ఫ్యాన్సీషాపు-1కు సంబంధించి కామినేని శివయ్య రూ. 3,69,000, ఫ్యాన్సీ ఐటమ్-2కు కామినేని మాధవ రూ. 3,15,000లక్షలకు పాట ద్వారా దక్కించుకున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ కెబి శ్రీనివాసరావు తెలిపారు. ప్రస్తుతం 2023-24 సంవత్సరానికి గాను రూ. 80.22 లక్షలు ఆదాయం వచ్చిందని తెలిపారు. కార్యక్రమాన్ని కందుకూరు గ్రూపు దేవాలయాల అధికారి వై బైరాగిచౌదరి పర్యవేక్షించారు. సిబ్బంది పాల్గొన్నారు.



వేలం నిర్వహిస్తున్న అధికారులు

జక్కపల్లిగూడూరులో రీ సర్వే

ప్రజాశక్తి-బిట్రగుంట



మండలంలోని జక్కపల్లి గూడూరులో బుధవారం జాయింట్ కలెక్టర్ రీ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కపల్లి గూడూరు గ్రామంలో రీ సర్వేపై రైతులతో అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ గ్రామంలో రైతులతో రీ సర్వేపై చర్చించి సంబంధిత అధికారులను రీ సర్వే త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలోని రైతులు సమస్యలను సచివాలయ రెవెన్యూ సిబ్బందికి తెలపాలని సూచనలు ఇచ్చామన్నారు. బోగోలు బిట్-1, బిట్-3 సచివాలయ సిబ్బందితో మాట్లాడి ప్రజలకు మెరుగైన సేవలందించే విధంగా చూడాలని తెలిపామన్నారు. ఉమామహేశ్వరపురంలో జరుగుతున్న స్వామిత్ర కార్యక్రమాన్ని పరిశీలించి మండల ప్రజా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్నం భోజనా మెనూ పరీక్షించి విద్యార్థులతో మాట్లాడామన్నారు. కార్యక్రమంలో కావలి ఆర్‌డిఒ శీనా నాయక్, తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ గోవిందరాజు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

అధికార పార్టీపై ఆగ్రహం

ప్రజాశక్తి-అల్లూరు



మండలంలోని రాయపేట గ్రామంలో బుధవారం మాజీ జెడ్‌పిటిసి బీద గిరిధర్ ఆధ్వర్యంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని చేపట్టగా అధికార పార్టీపై పలువురు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఇటీవల వైసిపి నాయకులు గడప గడప కార్యక్రమానికి విచ్చేయగా మాజీ ఎఎంసి చైర్మన్ మన్నెమాల సుకుమార్ రెడ్డి మీ గ్రామాన్ని అభివృద్ధి చేసే ప్రసక్తి లేదని మీకు దిక్కుంటే జగన్మోహన్‌రెడ్డితో మాట్లాడుకోవాలంటూ గర్వంగా ప్రవర్తించారని మహిళలు ఆవేదన వ్యక్తపరిచారు. టిడిపి నేత సుజాతమ్మ మాట్లాడుతూ గత తాగునీటి వసతి, సిమెంట్ రోడ్ల నిర్మాణం జరిగిందన్నారు. టిడిపిలో అభివృద్ధి తప్ప ఇంకేమి జరిగిందో ఆ నేతలు తెలపాలని సవాల్ విసిరారు. దమ్ముంటే దళితులకు చేసిన మేలేమిటో ఆ నేతలు చర్చకు రావాలని సవాల్ విసిరారు. ముఖ్య నేతలు అరగల రమణయ్య, రామిశెట్టి కృష్ణచైతన్య మాట్లాడుతూ సైకో పోవాలని ఎస్‌సి కార్పొరేషన్ నిధులు దోచుకున్న జగన్‌రెడ్డిపై వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆత్మకూరులో 'జగనన్న గోరుముద్ద'

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



పేద విద్యార్థులకు ఒక వరం లాంటిది జగనన్న గోరుముద్ద పథకం అని ఎంపిడిఒ సి.శ్రీనివాసులు తెలియజేశారు. బుధవారం ఆయన మండలంలోని ఎన్నువాడ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినులకు ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం స్కూలులో విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తుందని, ఎన్నడూ లేని విధంగా నాణ్యమైన పౌష్టికాహారం విద్యార్థులకు అందజేస్తూ, నాడు-నేడు ద్వారా స్కూల్స్ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించి ప్రభుత్వ స్కూళ్ల ప్రవేట్ స్కూల్స్‌కు ధీటుగా రూపాంతరం చెందుతున్నాయని ఎంపిడిఒ కొనియాడారు. ఈ తనిఖీలో స్థానిక సర్పంచ్ జగన్నాథ లక్ష్మమ్మ, స్కూలు ప్రధానోపాధ్యాయులు వెంగయ కార్యదర్శి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విష జ్వరాలతో బెంబేలు

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని పంచాయతీ అధికారులకు, మండల అధికారులకు పలుమార్లు విష జ్వరాల గురించి చెప్పిన పట్టించుకోలేదని సిపిఎం మండల కార్యదర్శి అన్వర్ బాషా ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో విపరీతమైన దోమలు, గుంపులుగా పందులు తిరుగుతున్న అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. అనంతసాగరంలోని రెండు సచివాలయాల్లో ఫాగింగ్ మిషన్లు ఉన్న అధికారులు ఒక్కసారి కూడా దోమల మందు గ్రామంలో పిచకారి చేయలేదని అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి డెంగ్యూ జ్వరాల వల్ల మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రతి సంవత్సరం డెంగ్యూ జ్వరం బారినపడి చిన్నారులు మరణిస్తూ ఉన్న పంచాయతీ అధికారులకు చలనం కలగడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో దోమలు, పందుల వల్ల వచ్చే విష జ్వరాల బారినుండి ప్రజలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన విక్రమ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



ఆత్మకూరు నియోజక వర్గంలోని పలు మండలాల్లో అవసరమైన చోట్ల సిసిరోడ్లు నిర్మాణాలు, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా నిర్మిస్తున్న రోడ్ల నిర్మాణాలకు, నిధులు మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి బూడి ముత్యాల నాయుడును ఆత్మకూరు ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి విన్నవించారు. బుధవారం అమరావతిలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును నియోజకవర్గంలోని నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలసి ఎంఎల్‌ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాలతో సత్కరించారు.

ఘనంగా శివకుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట



మండలంలోని కొమరిక గ్రామ వైసిపి నాయకులు, మండల రైతు విభాగం అధ్యక్షులు గూడూరు శివకుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు కొమరిక గ్రామంలో వైసిపి నాయకుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కేక్ కట్ చేసి పూలమాలతో ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడూరు ప్రభాకర్ రెడ్డి, వైస్ సర్పంచ్, వార్డు మేంబర్స్, వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని రాజుపాలెం వద్ద నెల్లూరు ముంబై జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. వివరాల మేరకు.. కడపజిల్లా ముద్దనూరు మండలం కొర్రపాడుకు చెందిన మహబూబ్ బాషా (52)ను కుమారుడు షఫీ లారీతో తొక్కించడంతో మృతి చెందారని, కుటుంబ కలహాల వల్లే తండ్రిని చంపారని పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వ్యక్తి మృతి

ప్రజాశక్తి-దగదర్తి

ఐ సర్ వాహనంలో వెళుతుండగా విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం గచ్చపువీధి చెందిన కాకినాడ బేన్నేసులు (67) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన మండలంలోని దామవరం సమీపంలోని జాతీయ రహదారి బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నర్సీపట్నం నుంచి కర్ణాటకలోని కుషానే నగరానికి కాఫీ గింజలతో వెళుతుండగా మధ్యాహ్నం 1.20 నిమిషాల సమయంలో దామవరం సమీపం వచ్చేసరికి ముందుగా వెళుతున్న లారీ ఒక్కసారిగా స్లో అవ్వడంతో వెనకనుంచి అతివేగంగా వస్తున్న ఐసర్ వ్యాను వేగాన్ని అదుపు చేయలేక ముందుగా వెళుతున్న లారీని వెనకనుంచి ఢీకొనడంతో లారీలో ఉన్న వంట సిలిండర్ పేరడంతో ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ అవ్వడంతో లారీలోని మంటలు చెలరేగాయని తెలిపారు. అందులో డ్రైవరు క్లీనర ప్రయాణిస్తున్నారన్నారు. క్లీనర వ్యాను లోంచి దూకేయడంతో డ్రైవరు లారీల్లో చిక్కుకుపోవడంతో మంటల్లో చిక్కుకుని కాలిపోయారని తెలిపారు. ఈ విషయాన్ని అగ్నిమాపక సిబ్బంది తెలపడంతో సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. గాయపడిన క్లీనర్‌ను కావలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని తెలిపారు.

'సంకల్పదీక్ష' విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి-నెల్లూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలు చేసిన సమయంలో ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు చేసిన హామీని అనుసరించి సిపిఎస్ రద్దు ఒపిఎస్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్మస్థలిలో 3వ తేదీన నిర్వహించ తలపెట్టి 'సంకల్ప దీక్ష' విజయవంతం చేయాలని యుటిఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఆ సంఘం నాయకులు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు మాట్లాడుతూ ధర్మస్థలి ప్రాంగణంలో నిర్వహించనున్న సంకల్పదీక్ష కార్యక్రమానికి అధిక సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి పలువురు మంత్రులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఎంఎల్‌సిలు పాల్గొంటారన్నారు. వాల్‌పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్రుల పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థులు పి.బాబురెడ్డి, మీగడ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఒపిఎస్ విధానం అమలు చేస్తున్నారని, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, పంజాబ్ రాష్ట్రాల్లో సైతం అక్కడి ప్రభుత్వాలు ఒపిఎస్ విధానం అమలు చేస్తున్నాయ న్నారు. ఇటీవల ఏర్పడిన హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం సైతం ఒపిఎస్ అమలు చేస్తుందన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.విచలపతి శర్మ, వి.వి.శేషులు మాట్లాడుతూ ప్రభుత్వం చేప్పే జిపిఎస్ విధానం ఎలా గ్యారంటీ అయినదో అర్థం కావడం లేదన్నారు. సిపిఎస్‌కు ప్రత్యామ్నాయం ఒపిఎస్ మాత్రమేనని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు ఎం.సి అచ్చయ్య, జిల్లా కార్యదర్శి ఎన్.మధుసూధన్‌రావు, ఎస్‌కె జమీర్, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

పరిశీలకుడిపై ఎంఎల్‌ఎ అసంతృప్తి

ప్రజాశక్తి-వరికుంటపాడు

ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకుడు ధనుంజయరెడ్డిపై ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మండలంలోని తూర్పు రంపిదొడ్ల గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన పలు సమస్యలను అప్పటికప్పుడు అక్కడున్న అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీనిచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మేకపాటి మాట్లాడుతూ రాబోయే కాలంలో జగనన్న మరోసారి సిఎంను చేసుకోవాలని లేకపోతే ప్రతిపక్షాల కుమ్ములాటలో రాష్ట్రం నిర్లక్ష్యానికి గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. అలాగే ఉదయగిరి పరిశీలకులు ధనుంజయ రెడ్డి ఇబ్బంది పెడుతున్నాడని ధనుంజయరెడ్డి నిర్ణయాలతో పార్టీకి చెడ్డ పేరు వస్తుందని సిఎం జగన్మోహన్ రెడ్డికి ఫిర్యాదు చేశారని తెలిపారు. అంతేకాకుండా తనపై పెత్తనం చేయటానికి ఎవరు ధనుంజయ్ రెడ్డి సిఎం, మంత్రి దగ్గర తేల్చుకోవడానికి కాదు దేనికైనా సిద్ధమే అంటూ సవాలు విసిరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ విజయభాస్కరరావు, తహశీల్దార్ హమీద్, మండల కన్వీనర్ బాలగురవారెడ్డి, జెడ్‌పిటిసి రావేల నాగేంద్ర, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి

పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపునకు ప్రచారం

ప్రజాశక్తి-కావలి



ప్రచారంలో పాల్గొన్న సిపిఎం నాయకులు

వెంగళరావు నగర్ 22వ వార్డులో పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో ఇందిరానగర్, పాతమసీదు, తదితర ప్రాంతాలలో పట్టభద్రుల ఓటర్లను కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో నిరంకుశ పాలనకొనసాగుతున్నదన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, నిరుద్యోగులు, ప్రజలు, వారి సమస్యలపై పోరాటాలు కొనసాగించిన ప్రభుత్వం ఉక్కపాదంతో అణిచివేయాలని చూస్తుందన్నారు. పోరాటాలను అణిచివేసేందుకు దుర్మాగంగా జిఒ నెంబర్ 1 తీసుకొచ్చిందన్నారు. అనంతరం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, నిరుద్యోగుల కోసం నిరంతరం పనిచేసే పిడిఎఫ్ తరుపున పట్టభద్రుల అభ్యర్థిగా పోటీ చేస్తున్న మీగడ వెంకటేశ్వర రెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓట్లు వేసి, గెలిపించాలని ప్రశ్నించే వారిని పెద్దల సభకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చెన్నయ్య, కృష్ణయ్య, కోటేశ్వరరావు, పెంచలనరసింహం, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు భూ హక్కులు కల్పించాలి


ప్రజాశక్తి-జలదంకి



నిరుపేద గిరిజనులకు భూ యాజమన్య హక్కులు కల్పించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దమ్ము దర్గాబాబు డిమాండ్ చేశారు. అన్నవరం పంచాయతీ దాసరి అగ్రహారం గ్రామంలో గిరిజనులకు ఇచ్చిన భూములను పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దాసరి అగ్రహారంలో నివాసం ఉంటున్నా భూమి లేని నిరుపేదలైన 5 కుటుంబాలకు 1982 సంవత్సరం ప్రభుత్వం వారు సర్వే నెంబర్ 918లో 14 ఎకరాల 30 సెంట్లు భూమిని ఒక్కొక్క కుటుంబానికి 286 సెంటల్లు ఇచ్చిందని రెవెన్యూ రికార్డులలో వారి పేర్లు 2014 వరకు 1 బి అడంగాల్ ఉన్నయని రెవెన్యూ రికార్డులలో అన్‌లైన్లో తారుమారు చేసి భూములు కనిపించకుండా చేశారని దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న భూ యాజమన్య హక్కులు కల్పించలేదని ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరిగినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దిక్కుతోచని స్థితిలో ఉన్నారని తెలిపారు. గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని సర్వే చేయించి ఇవ్వాలన్నారు. గ్రామ పంచాయతీలో చోటా నాయకులు ప్రభుత్వం గిరిజనులకు ఎక్కడా భూములు ఇవ్వలేదని వారిని బెదిరింపులకు గురిచేస్తూ సాగుకు అడ్డంకులు సృష్టిస్తున్నారు తక్షణమే ప్రభుత్వం అధికారులు స్పందించి గిరిజన భూములకు పట్టాలు మంజురు చేసి భూ యాజమన్య హక్కులు కల్పించాలని కోరారు. కార్యక్రమానికి వెంకటేశ్వర్లు, వెంకటాద్రి పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-బిట్రగుంట



మాట్లాడుతున్న మాజీ మంత్రి సోమిరెడ్డి

బోగోలు మండలం కప్పరాళ్ల తిప్ప గ్రామంలో జరుగుతున్న అక్రమ మైనింగ్ తవ్వకాలపై కట్టిన చర్యలు తీసుకోవాలని టిడిపి మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బోగోలు మండలం కప్పరాల తిప్ప గ్రామం పోలీస్ స్టేషన్‌కు కూత వేటలో జరుగుతున్న అక్రమ తవ్వకాలను బుధవారం మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, నెల్లూరు జిల్లా పార్లమెంటరీ అధ్యక్షుడు అజీజ్, తాళ్లపాక అనురాధ, టిడిపి కావలి నియోజక ఇన్‌ఛార్జ్ మాలేపాటి సుబ్బా నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఇసుక, గ్రావెల్, మట్టి మాఫియాలు ఎక్కువగా పెరిగిపోయాయని కావలి నియోజకవర్గంలో రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి గ్రావెల్ మాఫియా నడుపుతుంటే, నెల్లూరులో కాకాని గోవర్ధన్ రెడ్డి ఇసుక మాఫియా నడుపుతున్నాడన్నారు. బోగోలు, అల్లూరు, దగదర్తి మండలంలో కోటి క్యూబిక్ మీటర్లకు గ్రావెల్‌కు సీనరీస్ ఛార్జీలు ప్రభుత్వానికి రూ.105 కోట్లు కట్టవలసి ఉండగా ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. తిప్పలో గ్రావెల్ కోసం తవ్విన గుంటలో పిల్లవాడు దురదృష్టవశాత్తు పడి చనిపోయిన ప్రభుత్వానికి మాత్రం చీమ కుట్టినట్టుగా కూడా లేదని, అక్రమ తవ్వకాలపై కోర్టుకు వెళతామని, ప్రజాధనాన్ని మొత్తం కట్టేంతవరకు ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. టిడిపి మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు, ఎన్నాబత్తిన వెంకటేశ్వర్లు, ఎల్ మాధవరావు, ఎల్ సుదీర్, దన్యాసి శ్రీధర్, హరిబాబు, వెంకటేశ్వర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పిడిసిఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు



నగరంలోని టౌన్-1 ఎలక్ట్రిసిటీ విద్యుత్ రెవెన్యూ కార్యాలయాన్ని బుధవారం ఎస్‌పిడిసిఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ వి.ఎన్.బాబు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైనాన్స్ డైరెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి విద్యుత్ సర్వీసును జియో ట్యాగింగ్ చేయాలని ఆదేశం చారు. దీని వలన భవిష్యత్తులో ఏ సర్వీసు ఎక్కడ ఉందో కరెక్ట్‌గా ఐడెంటిఫై చేయొచ్చని తెలిపారు. బిల్లింగ్ ఐఆర్‌డిఎ బిల్లింగ్ చేసి వినియోగదారునికి ఖచ్చితమైన బిల్ ఇవ్వాలని సకాలంలో అందజేయాలన్నారు. కలెక్షన్స్ ఇంప్రూవ్ చేయాలని తెలిపారు. నెల్లూరు టౌన్ డివిజన్ కలెక్షన్స్ విషయంలో, బిల్లింగ్ విషయంలో, అన్ని పారామీటర్స్‌లో ముందంజలో ఉందని సంబంధిత అధికారులను పేరుపేరునా అభినందించారు. తర్వాత లాసెస్ తగ్గించుకోవాలని ఈ లాసెస్ తగ్గించినందువల్ల సంస్థకు మేలు జరుగుతుందన్నారు. ప్రతి సర్వీసు కేటగిరీ కరెక్ట్‌గా ఉండేటట్లు చూడాలని తెలిపారు. మల్టిపుల్ సర్వీసులో ఉన్నచో అవి క్లబ్ చేయాలని తెలిపారు. విద్యుత్ సంస్థ నష్టాల్లో ఉందని, కావున డెవలప్మెంట్ ఛార్జీలు వసూలు చేసి సంస్థను అభివృద్ధి బాటలో నడపాలని అధికారులను కోరారు. కంపెనీ ఆర్థిక పరిస్థితి బాగోలేదని అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేస్తేనే సంస్థ మనుగడలో ఉంటుందని కావున ప్రతి ఒక్కరూ టీం వర్క్ చేయాలని సూచించారు. సూపరింటెండింగ్ ఇంజనీర్ బి.వెంకట సుబ్బయ్య, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ కె.శ్రీనివాసులు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టౌన్ ఎ.సోమశేఖర్ రెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ మురళీ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.



ప్రజాశక్తి విలేకరి కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాళెం

బుచ్చిరెడ్డిపాళెం మండలంలో ప్రజాశక్తి దినపత్రిక విలేకరిగా పనిచేస్తూ ఇటీవల అకస్మాత్తుగా మృతి చెందిన తిమ్మన భాగ్యరాజు కుటుంబానికి ప్రజాశక్తి సిబ్బంది బుధవారం రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నెల్లూరు బ్రాంచ్ మేనేజర్ కె.కోటేశ్వరరావు, డెస్క్ ఇన్‌ఛార్జి యు వి రమణయ్య, ఎ.శ్రీనివాసులు కత్తి చిన్న, భాస్కర్, సిపిఎం నాయకులు చల్లకొలుసు మల్లికార్జున, పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎల తిరుగుబాటుతో ప్రభుత్వం పతనం

ప్రజాశక్తి-ఉదయగిరి

వైసిపి నాయకుల తిరుగుబాటు జగన్ ప్రభుత్వ పతనానికి నాంది అని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ జెడ్‌పి మాజీ చైర్మన్ పి.చెంచలబాబుయాదవ్ విమర్శించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఉద్యమాలకు పుట్టినిల్లు అయినా నెల్లూరు జిల్లాలో వైసిపిలో తిరుగుబాటు ప్రారంభమైందని, ఈ తిరుగుబాటు వైసిపి పతనానికి నాంది కాబోతుందని ఆయన ధ్వజమెత్తారు. 2024 ఎన్నికల్లో 175 స్థానాలు గెలుస్తామని ప్రగల్భాలు పలకడం మాని ముందు తమకున్నా 151 మంది ఎంఎల్‌ఎలు 2024 వరకు వైసిపిలో ఉంటారో ఓడిపోతారని ఆలోచించుకోవాలని దుయ్యబట్టారు. కుప్పం నుంచి నారా లోకేష్ పాదయాత్ర మొదలై నాలుగు రోజుల్లోనే వైసిపి ఎంఎల్‌ఎల గుండెల్లో ఓటమి భయం మొదలై ప్రజల్లో అపూర్వ స్పందన చూసి వైసిపి ఎంఎల్‌ఎలు మంత్రులు వైసిపి ప్రభుత్వం 2024లో అధికారంలోకి రాదని నిశ్చయించుకుని కొంతమంది ఎంఎల్‌ఎలు మంత్రులు మేకపోతు గంభరాన్ని ప్రదర్శిస్తూ నారా లోకేష్‌ను విమర్శించడం సిగ్గుచేటన్నారు. పాదయాత్ర 400 రోజులు చేరేసరికి రాష్ట్రంలో వైసిపి అడ్రస్ గల్లంతవుతుందని ఇకనైనా వైసిపి నాయకులు నారా లోకేష్‌పై అర్థం లేని విమర్శలు చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

మహిళల కోసం బ్యూటీషియన్ కోర్సు

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణంలోని సంయుక్త సేవాసంస్థ కార్యాలయంలో సంస్థ ఆధ్వర్యంలో పేద మహిళలకు ఉచిత బ్యూటీషియన్ కోర్సు ప్రారంభోత్సవం చేపట్టారు. కుట్టుశిక్షణ నేర్చుకున్న మహిళలకు బుధవారం సర్టిఫికెట్స్, చీరలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కావలి ఒకటో పట్టణం ఎస్.ఐ. ఆదిలక్ష్మి, సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్, కానిస్టేబుల్ షేక్ మంజాన్ బీ, బ్యూటీషియన్ సుకన్యలు పాల్గొని బ్యూటీషియన్ కోర్సు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం కుట్టు శిక్షణ నేర్చుకున్న మహిళలకు సర్టిఫికెట్స్, డాక్టర్ బెజవాడ విజయకానుకగా అందజేసిన చీరలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎస్.ఐ.ఆదిలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో బ్యూటిషన్ సుకన్య, సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవి కుమార్, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, సంస్థ గౌరవ సభ్యులు ఎం.చంద్రశేఖర్, ఎం.అజిత్ బాబు, పి.వెంకటసాయితేజ, కుట్టు శిక్షణా ట్రైనర్ షేక్.ఆయేషా, మహిళలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి : సిపిఐ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా టిడ్కో గృహాల్లో సమస్యలు పరిష్కరించాలని సిపిఐ ఆత్మకూరు నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో టిడ్కో గృహ లబ్ధిదారులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఉద్దేశించి సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి యామాల మధు మాట్లాడుతూ టిడ్కో గృహాల్లో డ్రెయినేజీ వ్యవస్థ చాలా దారుణంగా ఉందన్నారు. ఎక్కడికక్కడ డ్రెయినేజీ వ్యవస్థ దెబ్బతిని నీరుపోయే పరిస్థితి లేదని తెలిపారు. దాదాపు 1040 టిడ్కో ఇళ్లు ఉంటే సగం మంది కూడా నివాసం ఉండే పరిస్థితి లేదని, మున్సిపల్ వాటర్ సదుపాయం లేక టిడ్కో ఇళ్లలో చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు.

కనీసం వారానికి ఒకసారి కూడా పరిసరాలను శుభ్రపరిచే పరిస్థితి కనపడటం లేదని, పూర్తిస్థాయిలో వీధిలైట్లు లేవు నామమాత్రంగా అక్కడక్కడ లైట్లు వేశారన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు చుట్టూ కంచె లేకపోవడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నాయని తెలిపారు. ఇంకా టిడ్కో గృహాల్లో అనేక సమస్యలు తిష్ట వేసి ఉన్నాయన్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు సమస్యలను పరిష్కరించడంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. వెంటనే అధికారులు స్పందించి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించకపోతే టిడ్కో గృహాల సమస్యలపైన చలో కలెక్టరేట్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు బి.శేషాద్రి, ఎన్‌జిఒ నాయకులు స్టీఫెన్, రామచంద్రయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు

రక్తదాతలే ప్రాణదాతలు

ప్రజాశక్తి-కావలి

రక్తదాతలు ఆపదలో ఉన్నవారి పాలిటి ప్రాణదాతలని ఎపిఎస్ ఆర్‌టిసి డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ చిరంజీవిరావు పేర్కొన్నారు. ఎపిఎస్ ఆర్‌టిసి రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా బుధవారం కావలి ఆర్‌టిసి గ్యారేజీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన చిరంజీవిరావు మాట్లాడుతూ తరచూ రక్తదాన శిబిరాలను నిర్వహించే సంప్రదాయం గత మూడు దశాబ్దాలుగా ఆర్‌టిసిలో కొనసాగుతుందన్నారు. ప్రతి సంవత్సరం రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా రక్తదాన శిబిరం తప్పక నిర్వహిస్తామన్నారు. ప్రమాదాలలో గాయపడిన వారికి సకాలంలో రక్తం ఎక్కిస్తే ప్రాణం నిలబడుతుందన్నారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ డిపో కార్యదర్శి పసుపులేటి ప్రసాద్, ఫెడరేషన్ సభ్యులు పాల్గొని రక్తదానం చేసారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) కెవిఆర్ బాబు, అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) ఎస్‌కె ఖాజామొహిద్దీన్, సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామకృష్ణ, ఉద్యోగ సంఘ నాయకులు పీవీఎస్ బాబు, జి.వి.బాబు, టి.రఘునాథరెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ డి.రవిప్రకాశ్, రక్తకేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణారావు పాల్గొన్నారు.

0.7శాతం కేటాయింపు శోచనీయం

ప్రజాశక్తి-ఉదయగిరి



విద్యా సంబంధంగా కేటాయింపు కనీసం 0.7 శాతం కేటాయింపు చేయడం శోచనీయమని జనవిజ్ఞాన వేదిక రజతోత్సవ జిల్లా అధ్యక్షులు షేక్ గాజుల ఫారుఖ్ అలీ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యా సంబంధంగా కేటాయింపు కనీసం రెండు శాంతం కూడా కేటాయించకుండా 0.7 శాతం కేటాయింపు చేయడం శోచనీయంగా ఉందన్నారు. రాష్ట్రంలో 5 శాతానికి పైగా నిధులు కేటాయింపు చేయడం, అనేక విధ్యాసంక్షేమ పథకాలు అమలు చేయడం కేంద్రం కూడా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రజల ఆదరణతో సేవ : కాటంరెడ్డి

ప్రజాశక్తి-బిట్రగుంట

2024లో రానున్న శాసనసభ ఎన్నికల్లో ప్రజలు తనను ఆదరిస్తే అందరికీ సేవ చేస్తానని మాజీ శాసనసభ్యులు కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. బోగోలు మండలం ఎస్‌వి పాలెంలో గ్రామస్తులు ఏర్పాటు చేసిన విష్ణు శంఖారావం కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదిస్తే పోటీ చేసి శాసనసభ్యుడిగా ప్రజలకు సేవ చేస్తానని ముందుగా ఆదర అభిమానుల కోసం వచ్చానని తెలిపారు. కార్యక్రమంలో విష్ణు యువసేన, గ్రామస్తులు, అభిమానులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి వారి ఆధ్వర్యంలో ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉచిత శిక్షణ ఎటువంటి ప్రవేశరుసుము లేకుండా ఉచిత శిక్షణ ఇచ్చినట్లు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ శివ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కూడా కల్పించారు. ఈ శిక్షణ కాల పరిమితి మూడు నెలలు ఇస్తున్నట్లు, ఈ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు రవాణా ఖర్చులు కూడా ఇస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్లను 9182799405 ,7981271602 సంప్రదించాలన్నారు.

యూనియన్ ఏర్పాటు : సిఐటియు

ప్రజాశక్తి-ఉదయగిరి



మాట్లాడుతున్న సురేష్

సిఐటియు ఆధ్వర్యంలో ఉదయగిరిలో మినీ ట్రక్, గూడ్స్ యూనియన్ ఏర్పాటు చేశారు. బుధవారం స్థానిక కార్ స్టాండ్ ఆవరణంలో ట్రక్స్ గూడ్స్ డ్రైవర్ యాజమానులతో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా అధ్యక్షులు సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా రావాల్సిన పథకాలు హక్కులు కోసం పోరాడుతామన్నారు. యూనియన్ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా ఐక్యతతో సాధించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం మండల సిఐటియు నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలకు రోజురోజుకు అధికమవుతున్న కుటుంబ భారాలను అధిగమించేందుకు ప్రతిఒక్కరూ కలిసికట్టుగా ఉండి రాష్ట్ర జిల్లా కమిటీ పిలుపుమేరకు చేపట్టే కార్యక్రమాలు విజయవంతం చేసుకుందామన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు గడ్డం నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు కాకు వెంకటయ్య, నూతన యూనియన్ నాయకులు కార్మికులు పాల్గొన్నారు.